# తోలుబొమ్మలాటగాడు

మా ఆఫీస్ ఇన్‌స్పెక్షన్ సందర్భంగా ఇంటికి తెచ్చుకున్న ఫైళ్ళలో నేను తల దూర్చి కూర్చుని ఉండగా, రాత్రి తొమ్మిది గంటల వేళ, నా తోటివాడు భాస్కరం వచ్చి, ''వీధి చివర తోలు బొమ్మలాట ఉంది రా, రా,'' అని నన్ను కదలేశాడు. నేను మా శ్రీమతిని లేపి, ఇల్లు అప్పగింతలు పెట్టి, వాడితో బయలుదేరాను. మేము వెళ్ళేసరికి ఆట మొదలయ్యే పోయింది. తెర మీది బొమ్మల్ని బట్టి వాళ్ళు ఆడుతున్నది రామాయణమనీ, అదిన్నీ సుందరకాండ అనీ గ్రహించాను. విరామం కోసం అప్పుడే జుట్టుపోలిగాడు తెర ఎక్కేశాడు. చూడగానే నవ్వు తెప్పించే ఇంకో బొమ్మ (పాత్ర) తో వాడు మాట్లాడుతున్నాడు.

జుట్టు పోలిగాడు : నాకు చదువు చెప్తావేంట్రా గురూ?

గురువు : ఓ, ఏం చెప్పమన్నా వేంటి - తెలుగా, మరాఠీయా, బెంగాలీయా, హిందీయా?

జుట్టుపోలిగాడు : ఏదో ఒకటి. పోనీ హిందీ చెప్పెయ్‌వో! మరిగంటే ఫీజెంతెంట్రా, గురూ?

గురువు : నీ కాడెంతుంది ?

జుట్టుపోలిగాడు : మూడొందలు.

గురువు : అదిచ్చెయ్, చాలు.

జుట్టుపోలిగాడు కంగారు పడ్డాడు. రెండో వైపుకు తిరిగి, స్వగతంగా, ''అమ్మ కొడుకోయ్, అంతా కొట్టేద్దారనుకుంటన్నాడు. ఎరక్క పోయి నాలిక జారేశాను.. కొంచెమయినా బేరం చెయ్యకపోతే ఇది బిజినెస్సవ్వదే!.... సరే, ట్రై చేద్దాం!'' అనుకున్నాడు. మళ్ళీ గురువు వైపు తిరిగాడు.

జుట్టు పోలిగాడు : గురూ, గురూ

గురువు : ఏంట్రా, చిష్యా?

జుట్టుపోలిగాడు : నా కాడ రెండొందలే ఉన్నాయి రోయి.

గురువు : పోన్లే, అవిచ్చెయ్, చాలు.

జుట్టు పోలిగాడు అదిరి పడ్డాడు. మళ్ళీ రెండో వైపుకు తిరిగి, ''అరెరె, ఎంత పనయింది? వందే ఉందని చెప్పాల్సింది. సరే, చూద్దాం'' అనుకున్నాడు. ఆట చూస్తున్న ప్రేక్షకుల మొహాల్లో చిరునవ్వు మొలక లెత్తాయి. స్టేజికి ముందరగా కూర్చున్న పిల్లలు అప్పుడే పైకి నవ్వేస్తున్నారు.

జుట్టు పోలిగాడు : ఒరేయ్, గురూ!

గురువు : చెప్పరా, చదువు ముష్టాడా!

జుట్టు పోలిగాడు : నువ్విన్నది తప్పు నా కాడ వందే ఉన్నయ్!

గురువు . పోన్లే , అవ్వే ఇచ్చెయ్.

జుట్టుపోలిగాడు ఈ మాటు కింద పడిపోయి, పైకిలేచాడు అనుకున్నాడు . ''ఈడి సిగ దరగ -

అసలేం లేదన్నా చదువు చెప్పేసేట్టున్నాడు... ఇహ చూసుకో మన తడాఖా!'' వాడు మళ్ళీ గురువు వైపు తిరిగాడు.

జుట్టుపోలిగాడు : మరిహ అయ్యన్నీ మరిచిపో. మందగ్గిరేం లేదు

గురువు : ఇంతేనంట్రా, పరవాలేదు, చదువు చెప్పుతాను, రా

జుట్టుపోలిగాడు : చెప్పు

గురువు : బైటో అంటే కూర్చోమని, ఉటో అంటే నుంచోమని.

జుట్టుపోలిగాడు : సరయితే రైటో!

గురువు : ''బైటో, ఉటో'' అని వరసగా మూడుసార్లు అన్నాడు. ఆ మాటలకు తగినట్టుగా జుట్టు పోలిగాడు కూర్చోవటం, నుంచోవటాలను ఇదే క్రమంలో మూడు సార్లూ చేశాడు. నాలుగో సారికి గురువు హఠాత్తుగా క్రమం మార్చేసి, ''ఉటో, బైటో'' అన్నాడు. దాంతో, మామూలు క్రమం లోనే కూర్చోవటం, నుంచోవటం చేసిన జుట్టుపోలిగాడు, తప్పు చేసిన వాడయ్యాడు. వెంటనే గురువు జుట్టుపోలిగాడ్ని పీక పుచ్చుకుని దవడల మీద ఎడా పెడా వాయించాడు. ఏడుస్తూ జుట్టుపోలిగాడు అన్నాడు: ''నన్నెందుక్కొడతావు?''

గురువు : కొట్టడమేంటి, చమడా లెక్క దీస్తాను. పుండాకోర్! అబద్ధాలాడి ఫ్ఱ్ఱ్ఱ్ఱ్‌రీగా చెప్పించుకుందామనుకున్నావా?... ముందా డబ్బక్క డెట్టు.

జుట్టుపోలిగాడు జేబులోంచి డబ్బు తీసి గురువు చేతిలో పెట్టాడు. గురువు - ''ఫో, ఇంకెప్పుడూ అబద్ధాలాడకు.'' అన్నాడు.

ఇద్దరూ తెర మీద నుంచి దిగిపోయారు. ప్రేక్షకుల్లో నవ్వు సెలయేరై, రచ్చబండ తాలూకు రావిచెట్టు గలగలల్లో కలిసిపోయింది. పిల్లల విషయం చెప్పనక్కర్లేదు. వాళ్ళు పగలబడి, పగలబడి నవ్వేస్తున్నారు. చెప్పొద్దూ... నాకూ, భాస్కరానికీ కూడా నవ్వాగలేదు.

ఇంతవరకూ, ఈ హాస్య పాత్రలకు ప్లేబాక్ చెప్పిన వాళ్ళు ప్రధాన కథకుడి కొడుకులట. నా వెనకాల కూర్చున్న కరణంగారు చెప్పాడు. ఇప్పుడింక ప్రధాన కథ మొదలయింది కనక, ప్రధాన కథకుడి గొంతు, అతడి భార్య గొంతు ఖంగుమని వినిపించ సాగాయి.

హనుమంతుడు మహేంద్ర శిఖరం మీదనుంచి ఎగిరాడు. కొంత దూరం రాగానే సురస ఎదురు వచ్చి, ''నా నోట్లో నుంచి దూరి బయటకు రా'' అంది. హనుమంతుడు తన శరీరం పెంచేశాడు. సురస తన నోటి అవరణను పెంచింది. హనుమంతుడు ఇంకా పెద్ద వాడయ్యాడు. సురస మరింత పెద్ద నోటిని చూపించింది. హఠాత్తుగా హనుమంతుడు అతి చిన్నవాడయిపోయి, ఆ నోట్లో దూరి, చటుక్కున వెనక్కు వచ్చేశాడు.

ప్రధాన కథకుడు ఈ ఎఫెక్టును చూపడంలో అద్భుతమైన ప్రజ్ఞను కనపరిచాడు. వేరు వేరు సైజుల్లో ఉన్న మూడు జతల సురస, హనుమంతుల బొమ్మలను వేగంగా తెర మీద పెట్టి తియ్యడంలో తల పండిన అతని అనుభవమంతా వెల్లడయింది. 'సురసా హనుమంతులు, తెర మీది వాళ్ళు తెర మీదనే, నిజంగానే పెరిగిపోయారా?' అన్న అనుమానం కలిగేలా ఉంది, ఆ హస్త కౌశల్యం! ఈ బొమ్మలను

ఇట్లా మార్చడంతోబాటు, తెర వెనక చక్కని కంఠంతో రాగయుక్తంగా అతను చెప్పిన పద్య గద్యాలూ, అయాచోట్ల వీటిని తనుకూడా చెబుతూనే హార్మోనియాన్ని కూడా వాయిస్తున్న ఆ ఆడదాని రాగమాధుర్యమూ అక్కడ కూర్చున్న ఆబాల వృద్ధుల్ని మైమరచేట్టు చేశాయి.

మా ఇద్దరి విషయం వేరే చెప్పడ మెందుకు? నిమిషానికో సిగరెట్టు తగలేసే మేమిద్దరమూ ఆ విషయమే మరిచిపోయి, నోళ్ళు తెరుచుకుని, కళ్ళప్పగించి రచ్చబండ నానుకుని, ఈతాకుల చాప మీద అట్లాగే కూర్చుని ఉండిపోయాము.

★ ★ ★

మరునాడు ఆదివారం ఆ నాడే మా మేనేజరు ఇంట్లో పెళ్ళి విందుకూడా ఫైళ్ళలో తల ముంచిన కారణంగా విందుకు నేను వెళ్ళలేదు. సాయంకాలం నాలుగు గంటల వేళ, కాస్త పైర గాలి పీలుద్దామని బయటకు నడిచాను. భాస్కరం ఇంటికి వెళ్ళాను.

ఆ చుట్టు పక్కల వాళ్ళతో వసారా కొంచెం సందడిగా ఉంది అందరి మొహాలూ సీరియస్‌గా ఉన్నాయి. డాక్టర్ తాలూకు మెడికల్ చెస్టు ఒకటి బయట కుర్చీమీద ఉంది. ఆదుర్దా కొద్దీ అందర్నీ తోసుకుని నేను లోపలికి వెళ్ళాను. భాస్కరం గోడ కానుకుని నేలమీద పడున్నాడు. కడుపు కండలాగా ఉబ్బిపోయి ఉంది. ఉండి ఉండి నాలిక బయటకు జాపి, ''దాహం, దాహం'' అంటున్నాడు. అతని భార్య నన్ను చూసింది. నా దగ్గరకు వచ్చి, ''అన్నయ్యగారూ! పెళ్ళి భోజనానికి వెళ్ళివచ్చినప్పట్నుంచీ ఈయన తాగిన నీళ్ళు నీళ్ళు కావండీ. నుయ్యి ఎండి పోయిందండి.... అయిపోయిందండీ, అన్నయ్యగారూ, నా కుంకం రాలి పోయిందండీ!'' అంటూ బావురుమన్నది. నేను డాక్టర్ వైపు తిరిగాను. ఆయన, ''సారీ,సర్, టూలేట్! ఇంతకు ముందే సెలైనూ, గ్లూకోజూ ఎక్కించాను. నో యూజ్ పిలోకార్పిన్ నైట్రేడ్ కోసం జంగారెడ్డి గూడెం పంపించాను. అది అరగంటలోవస్తే సరేసరి. లేకపోతే అయామ్ సారీ!'' అన్నాడు నాకు మతిపోయింది నేనేం చెయ్యాలో తోచని అయోమయావస్థలో అడుగులు వేసుకుంటూ వసారాలోకి వచ్చాను.

''బాబూ!'' అన్న పిలుపు విని ఈ లోకంలోకి వచ్చాను ముతక పంచెమీద మాసికల లాల్చీతోను, పండు జుట్టుతోనూ ఉన్న అరవై ఏళ్ళ వృద్ధుడొకడు సాక్షాత్కరించాడు. నేను ఏమిటన్నట్టు చూశాను. అతను -''లోపల ఎవరో అనారోగ్యంగా ఉన్నట్లున్నారు?'' అన్నాడు.

''అవును. నువ్వెవరు?''

''బొమ్మలాట మనిషినండి రాత్రి బొమ్మలాట ఆడామండి.. జబ్బేమిటో చెప్పారు కారు.''... '' ఏ జబ్బైతేనేమయ్యా, నువ్వేం చెయ్యగలవ్?'' అతను, ''చిత్తం, చిత్తం'' అన్నాడు. అన్నాడు కాని అక్కడ్నుంచి కదల్లేదు. పైగా మెట్లెక్కి వసారా లోకి వచ్చి, కిటికీ గుండా లోపలికి తొంగి చూసి నన్నడిగాడు : ''బాబూ! సుస్తీ ఏమిటో చెప్పరూ?''

నాకు చిర్రెత్తు కొచ్చిన మాట నిజం. కానీ తమాయించుకుని, ''తెలీటం లేదు. విందు భోజనానికి వెళ్ళొచ్చి నీళ్ళు తెగ తాగుతున్నాడు ఆ పొట్ట కనపడ్డంలా?''అన్నాను వృద్ధుడు నాకు దగ్గరగా వచ్చి, చెవుల్లో చెపుతున్నట్టు మెల్లిగా అన్నాడు ''బాబూ! తమరు ఆలకిస్తామంటే చిన్న మాట చెబుతాను నూనె కాని, నెయ్యి కాని ఎక్కువగా తగిల్తే ఈ పరిస్థితే వస్తుంది. దీనికి ఏ డాక్టరూ అక్కర్లేరు, బాబుగారూ!

రెండు ఫస్టు క్లాసైన నీళ్ళ బొండాలు తెప్పించండి. అవి లేకపోతే మామూలు కొబ్బరికాయ లైనా సరే.''
నేను చటుక్కున అతని వైపు తిరిగాను. ''తెప్పిస్తాను. నీ వైద్యం నమ్మమంటావా?''

''మీరు చెప్పిందే రోగమయి, నా వైద్యమే మీరు చేసేట్లయితే పావు గంటలో వారు లేచి తిరక్కపోతే నన్ను చెప్పుతో కొట్టండి. నే నిక్కడే ఉంటాను.''

నేనింక లిప్త కాలంకూడా ఆలస్యం చెయ్యలేదు. ఎవరిదో సైకిల్ వేసుకుని సెంటరుకు వెళ్ళాను. నా కోసమే ఉన్నా యన్నట్టు అక్కడ రెండే రెండు బొండాలున్నాయి. వాటిని కొనేసి తెచ్చేశాను. తేవటమేమిటి, కొట్టేసి గురుడికి ఎక్కిం చెయ్యట మేమిటి, అన్నీ ఒక్క సారిగా జరిగిపోయాయి. అయిదు నిమిషాలు గడిచేసరికి భాస్కరం 'దాహం' కేకలు మానేశాడు. ఇంకో అయిదు నిమిషాల తరవాత వాడి నోరు మూతపడింది. గోడ వారగా సొమ్మసిల్లి నట్లు పడిపోయాడు. మరో పది నిమిషాలకు ఆయాసం తగ్గిన సూచనలు కనిపించసాగాయి. మరో పది నిమిషాలకు కళ్ళు విప్పి చూసి వాడంతట వాడే లేచి కూర్చున్నాడు. నుంచుని లుంగీ సర్దుకున్నాడు. ''అబ్బ, పొట్ట బరువుగా ఉందిరా!'' అన్నాడు. ''నీ శ్రాద్ధం లాగా లేదూ?'' అన్నాను ఒళ్ళు మండిపోయి. వాడు నడుచుకుంటూ వెళ్ళి మంచం మీద పడ్డాడు.

వాకిట్లో వృద్ధుడు నన్ను పిలిచాడు. ''అయ్యా, ఇంకో రెండు కాయలు తెప్పించండి. ఇంకో అర్థగంట పోయాక ఇవ్వండి. ఈ రాత్రికి మరింక ఏమీ తినవద్దని చెప్పండి'' అన్నాడు. ''తినటమా? పీక పిసికేసి పాతేసెయ్యనూ!'' అన్నాను. భాస్కరం భార్య నన్ను పిలిస్తే లోపలికి వెళ్ళాను. ఆమెతో కొంచెం సేపు మాట్లాడి తిరిగి వచ్చేసరికి వృద్ధుడు లేడు. ఎక్కడి వాళ్ళు అక్కడికి సర్దుకుంటూండగా, భాస్కరాన్ని వాడి భార్యకు అప్పగింతలు పెట్టి, మా శ్రీమతి నాకు కందిపప్పు తేవటం పురమాయించిన సంగతి జ్ఞాపకం రాగా, నేనుకూడా బజారుకి బయలుదేరాను.

★ ★ ★

మర్నాడు ఆఫీసుకు వెడదామని పెందలాడే బట్టలు వేసుకుంటూండగా వీధి భాగవతుల మేళం ఒకటి మా వాకిట్లోకి వచ్చింది. వాళ్ళు ముగ్గురు. ఒకడు ఎర్రగా, దిట్టంగా ఉన్నాడు. పట్టు పంచె మీద పట్టు అంగవస్త్రం (అన్నీ చవకవే) బిగించి కట్టాడు. పొట్ట, గూడలు, కంఠం, మెడ, వీటన్నింటినిండా నామాలు దిట్టంగా పెట్టాడు. భుజాల మీద ఒక దాని మీద శంఖం, ఇంకో దాని మీద చక్రం దిద్దాడు. గిరజాలు భుజాల మీదికి వేళ్ళాడుతూండగా రాగం పాడుతున్నాడు. మిగతా ఇద్దరూకూడా పంచెల మీద అంగవస్త్రాల వేషాల్లోనే ఉన్నారు. ఒకడు హార్మోనియాన్ని , ఇంకొకడు తాళం చిప్పల్ని పట్టుకొనున్నారు. నేను నోరు తెరిచి 'వద్దు' అనే లోపలే ప్రధాన భాగవతుడు గొంతెత్తేశాడు.

''ఇప్పుడు మేము వచ్చిన కార్యం - ప్రస్తుతం భద్రాద్రి రాముల వారి ఆలయం వరదల్లో తేలిపోతోందిట. మేము అక్కడికి వెళ్ళి మా నిస్వార్థతతో స్వామి వారిని నీళ్ళమీద తేల్చి రక్షిద్దామని సంకల్పించుకున్నాము. ఆ రాముడికి మీరు కట్టుకున్న ముడుపు లేమయినా ఉంటే మా చేతి కివ్వండి బాబూ! కంటెలు, కాసుల పేర్లు, పట్టెళ్ళు, పలకసేర్లు, నాంతాళ్ళు, చంద్రహారాలు, రుద్రాక్షలు, గాజులు, వంకీలు, మురుగులు, కడియాలు, ఉంగరాలు, సింహతలాటాలు, మొలబిళ్ళలు, తల భిళ్ళలు, పాపట బిళ్ళలు, జడ కుప్పెలు, దుద్దులు, జూకాలు, చెంప పిన్నులు, చొక్కా పిన్నులు, కుట్టు పిన్నులు, గడియారం పట్టీలు, దండాలు, బులాకులు, బేసర్లు, ముక్కర్లు, చివరకు ముక్కుపొడుం డబ్బీలైనా సరే, మీరు

మొక్కుకుని ఉంటే ఇదుగో వీడి కిచ్చేయ్యండి చాలూ వీడు బహుజాగ్రత్తైనవాడు హార్మనీ పెట్టిలో వాటిని భద్రంగా మోస్తూంటాడు. 'కృష్ణార్పణం' అని ఒక్కసారి అనుకోండి అవి ఇంక ఆ రాముడికి చేరినట్లే, మీకు మోక్షం వచ్చినట్లే!''

నా వెనకాలే నుంచుని ఈ భాగవతం వింటున్న మా శ్రీమతి, వింటున్నది వింటున్నట్లే చటుక్కున నా రెక్క పట్టుకుని నన్ను గుమ్మంలోకి గుంజింది. కంగారు పడిపోతున్న మొహంతో అంది : ''కొంప దీసి, పసివాడి కాలు విరిగి నప్పుడు మనం మొక్కుకున్న మురుగులు కాని వీళ్ళకిచ్చేస్తారేమిటి నమ్మి? అట్లాంటి త్రాష్టప్పని చేస్తే నేనొప్పను'' అంది నాకు నవ్వాగక ఫకాలున నవ్వేశాను. ఆ భాగవతుడు ఈ మాటలు విన్నాడు కాబోలు, తానుకూడా నవ్వాడు. రెండు క్షణాల తరవాత విషాదం తొంగి చూస్తున్న మొహంతో అన్నాడు : ''అయ్యా! మీ మాత్రంగా నా మాటలు ఆలకించిన వాళ్ళు అరుదు, నా హాస్యం పని చేసిన చోట్లు అరుదు. పోషించే వాళ్ళు లేక కళ క్రమంగా నశించిపోతూంది. అడుగూ బొడుగుగా మిగిలిన మా బోంట్లకు మీ బోంట్లే ఆధారం... అయ్యా! ఇది రెండో వేషం. రేపు అర్ధనారీశ్వరం. బాబూ! సెలవు''.

ఏదో కీర్తన నందుకున్నారు వాళ్ళు. హార్మోనీ మోగుతుండగా హడావుడిగా ఎదురింటి వైపు కదిలారు. పైకి చెప్పుకో లేని ఏదో ఆనందంతో నా మనస్సు తేలిపోతూండగా, నేను సైకిలెక్కాను. మా శ్రీమతి ఇంకా నిర్ఘాంతపోతూ చూస్తూనే ఉంది గుమ్మంలో!

★ ★ ★

మళ్ళీ ఆదివారం వచ్చింది. జరిగిపోయిన ఇన్‌స్పెక్షన్‌లో, నా పనితనానికి గాను నేను పొందిన మెప్పుకోళ్ళను నెమరు వేసుకుంటూ వాలు కుర్చీలో కూర్చుని ఉన్నాను. మా వసారాలో హడావుడిగా ఓ గంపెడు జనం వాకిట్లోకి జొరబడ్డారు. వాళ్ళల్లో, ఆ నాడు మా భాస్కరానికి మందు వేసి బతికించిన వృద్ధుడు, భాగవతుల వేషం కట్టిన యువకులు, ఓ వృద్ధురాలు, ఓ యువతి ఉన్నారు. అందరూ నాకు నమస్కారం చేశారు. వృద్ధుడు అన్నాడు : ''ప్రభువులకు దండాలు. . . బాబూ! మాకు వచ్చిన విద్యలన్నీ ప్రదర్శించాము. మాది పెద్ద కుటుంబం. మా విద్యలు తప్ప వేరే ఏ ఆధారమూ లేని వాళ్ళం. ఏదో తమకు తోచింది దయ చేయిస్తే బరంపురం దాకా తమ పేరు చెప్పుకుంటూంటాము.'' నేను ఇంట్లో నుంచి రెండు చాపలు తెచ్చి వేసి వాళ్ళను కూర్చోమన్నాను. వృద్ధుడు మాత్రం కూర్చున్నాడు. మిగతా వాళ్ళు, ''పక్క ఇళ్ళకు వెళ్ళొస్తాం'' మని చెప్పి వెళ్ళిపోయారు. నేను వృద్ధుడితో అన్నాను : ''ఏ ఊరు మీది?''.... ''తూర్పుగోదావరి జిల్లా భట్నవిల్లండి.''.... ''నీ బొమ్మలాట చూశాను. బాగుంది. నీ పిల్లల భాగవతం కూడా బాగానే ఉంది. మీ కుటుంబమంతా కలిసి ఒక సమాజంగా ఏర్పడి వీటిని పైకి తీసుకరాకూడదూ!''

''బాబూ! తమరు చెప్పింది బాగానే ఉంది కాని, నా విద్యల్ని చూసే వాళ్ళే బహు తక్కువ మంది. సినిమా లొచ్చాక మన దేశంలో దేశీయమైన ఏ కళ బతికి బట్ట కట్టింది, బాబూ? బొమ్మలాట కేమి? హరికథ, పురాణం, జక్కుల కథ, చివరికి నాటకాలు కూడా నాశనమై పోయాయి కద! అయినా సరే, తమరు సెలవిచ్చినట్లు ఏదో సమాజం పేరుతో నడుద్దామంటే, దానికి ఎంతెంత మంది అధికారుల్ని ఆశ్రయించాలి ఎంతమంది నాయకుల్ని ఇలాకా చేసుకోవాలి! పూటకు టికాణాలేనివాణ్ణి అంత ఎత్తుకు

ఎగరగలనా, బాబూ?''. ''గడవటమే కష్టమంటున్న వాడివి వైద్యాన్నే నమ్ముకోకపోయావా, నీ జీవితం హాయిగా గడిచేది కథ.''

వృద్ధుడు నవ్వాడు : ''బాబూ! జీవించడానికి ఉపయోగించే విద్య కాక, కనీసం ఇంకొక్క విద్యనైనా నేర్చుకుని పది మందికీ ఉచితంగా సేవ చెయ్యట మనేది మా వంశాచారమండి. మా వాళ్ళందరూ ఉచితంగానే వైద్యం చేసేవారండి. మరి. ఇహ, బొమ్మలాట వదులుకుంటే నాకు అదే గతనుకోండి.''

నేను ఆలోచనలో పడ్డాను. విద్యలు డబ్బు సంపాదన కోసమేనని మాత్రమే నా బి.ఎ.డిగ్రీ నాకు నేర్పింది కాని, ఇంకొకళ్ళకు ఉచితంగా సహాయ పడ్డానికి కూడా అవి ఉపయోగిస్తాయని మాత్రం నాకు నేర్పలేదు. ఉండి ఉండి, నాకే ఆశ్చర్యం కలిగించే విధంగా ఒక ప్రశ్న నాకు తట్టింది. దాన్ని పైకి వెళ్ళబెట్టేశాను.

''ఇంతకీ మీ రే కులం?''

ఒక్క నిముషం ఆగి వృద్ధుడన్నాడు : ''బాబూ! పెద్ద ప్రశ్నే అడిగారు. మీరు ఓపిగ్గా వింటానంటే ఒక కథ చెబుతాను. సుమారు పన్నెండు వందల సంవత్సరాల క్రితం, చోళదేశపు రాజుగారొకాయన తనకు సంతు లేకపోయెనని బాధ పడుతూండే వారు. ఆయన పూజలు, పునస్కారాలు చెయ్యగా, రాణీగారు గర్భవతి అయి ఆడపిల్లను కన్నది. మగపిల్ల వాడు కలగలేదన్న వార్త రాజుగారికి చాలా బాధ కలిగించింది. మరు క్షణంలో ఆయన మంత్రిని పిలిచి తన బాధను వెలిబుచ్చుకున్నాడు. చిత్రంగా, కోటలో చెరువును తవ్వుతున్న ఒక వడ్డె వాడి భార్యకూడా అదే సమయంలో మగపిల్లవాణ్ణి ప్రసవించిందనే విషయం మంత్రికి తెలిసింది. గుట్టు చప్పుడు కాకుండా మంత్రి ఇద్దరు శిశువుల్నీ తారుమారు చేశాడు. రాజుగారి కొడుకు పెరిగి పెద్దవాడయ్యాడు. రాజుగారు వాడిని యువ రాజుగా పట్టాభిషిక్తుణ్ణి చేయాలనుకున్నాడు. ఊళ్ళో శ్రేష్ఠులైన ఆచార్యులను పిలిచి, బంగారం ఇచ్చి, కిరీటం, కత్తి, డాలు చెయ్యమన్నాడు. వాళ్ళు బంగారాన్ని పోత పోశారు. అయితే, ఏర్పడిన వస్తువులు తట్ట, గుట్ట, గునపం, పార ఆకారంలో ఉన్నాయి. వాళ్ళు మంత్రితో ఈ విషయం చెప్పారు. మంత్రి 'అసలు రహస్యం వీరికి తెలిసి పోతుందేమో' నని కంగారు పడి, ఏదో మిషమీద వారిని రాజ్యం నుంచి వెళ్ళగొట్టాడు. వాళ్ళు తమ కుటుంబాలతో సహా అరణ్యం లోకి వెళ్ళి పోయారు. రాజు మీద పగ తీర్చుకోవాలనే తపన కాలం గడిచిన కొద్దీ వాళ్ళలో అధికం కాసాగింది. వాళ్ళు అడవుల్లో దొరికే మేకలు, లేళ్ళు, దుప్పుడు, వగైరా మృగాల చర్మాలతో తోలు బొమ్మలు చేసి వాటికి రంగులు వేసి, రాజవంశాన్ని గొప్పగా కీర్తించే విధంగా ఆట ఆడించడం అనే కళను సాధన చేశారు. పనిలో పనిగా వాళ్ళు రామాయణం, భారతం, ఇత్యాది పురాణ కథలను ఆడించటంలో కూడా ప్రావీణ్యం సంపాదించారు. చివరకు, కొన్నేళ్ళ అనంతరం, వాళ్ళు రాజు దగ్గరకు వచ్చి, తాము ఒక కొత్త రకం విద్యను ప్రదర్శించే విద్వాంసుల మనీ, తాము ఆ రాజ వంశ చరిత్రను ఒకానొక జానపద కళ సహాయంతో అద్భుతంగా కీర్తించగలమనీ, దాన్ని రాజు సపరివారంగా విచ్చేసి, తిలకించాలనీ కోరారు. దానికి రాజు సమ్మతించాడు. ఒక రాత్రి ఆ బొమ్మలాటను చూడటానికై సేనా నాయకుడితో సహా రాజ పరివారమంతా వచ్చి కూర్చున్నారు. ఆట మొదలై మంచి పట్టులో ఉండగా ఆ ఆవరణ బయట కత్తులతో కాసుకుని ఉన్న ఆ ఆటగాళ్ళ తాలూకు మనుషులు హఠాత్తుగా లోపలికి ప్రవేశించి దొరికిన వాళ్ళందర్నీ నరికి పోగులు పెట్టారు. దానితో ఆ రాజవంశం అంతమయింది. ఆ ఆటగాళ్ళు వెంటనే సింహాసనాన్ని చేజిక్కించుకుని పరిపాలకులయ్యారు. అయ్యా! ఆ నాటి ఆ

ఆటగాళ్ళ తాలూకు బొమ్మల పెట్టెల్ని మోసిన వాళ్ళే మేమట, బాబూ! '' వృద్ధుడు కొంచెం సేపు తలవంచుకొని మౌనంగా ఉండిపోయాడు రెండు నిముషాల తర్వాత "మమ్మల్ని ఆర్య బొందిలీలంటారు. మాలో మహారాష్ట్ర రక్తం ఎప్పుడు కలిసిందో తెలీదు కాని, మాకు మారాఠీ కూడా వచ్చు. ప్రస్తుతం మేము సగం ఆంధ్రులం, సగం మరాఠీలం."

"సరే, కథ బాగానే ఉంది... నువ్వు మాత్రం ఈ రోజుల్ని బట్టి కళనే అంటి పెట్టుకుని బతకాలనే ధోరణిని మార్చుకుని, ఉద్యోగం ఏదైనా చూసుకోవటం మంచిది. ఇప్పుడంతా యంత్రయుగం. ఆఫీసులు, ఫ్యాక్టరీలు, వాటికి సంబంధించిన సాంకేతిక విద్యలూను. వీటి మధ్య నువ్వు ఆ పాత చింతకాయ పచ్చడి మాటలు చెప్పకూడదు."

తలెత్తి అన్నాడు : "నిజమే, బాబూ! కానీ యంత్రాలు జీవితంలో కొంతవరకే కొందరికే ఉపయోగిస్తాయి. కాని, అందరికీ కాదు, బాబూ! మిగిలిన భాగమంతా హృదయంతోనూ, మనస్సుతోనే కదండీ నడిచేది. మరి ఆ మనస్సును ఎప్పటికప్పుడు మృదువుగా ఉంచుతూ, పది మందిలోనూ మంచి భావాలు కలిగిస్తూండేవి కళలే కద, బాబూ! ఇవే లేకపోతే హృదయ కాఠిన్యం పెరిగి మనుషులందరూ ఒకర్నొకరు నరుక్కుంటూ పోరూ? . . . ఇవన్నీ ఎందుకు, బాబూ, ఈ కళలు నా పిత్రార్జితాలు. నేను బొమ్మల్లో పుట్టాను, వేషాల్లో పెరిగాను. ఊళ్ళు తిరుగుతూ సంపాదించిన విజ్ఞానాన్ని ఊళ్ళు తిరుగుతూనే పంచి పెడుతున్నాను. నన్ను నేను బతికించుకుంటూనే పది మందికీ సహాయపడుతున్నాను. పైగా ఎంత సంపాదించుకుంటే అంతతోనే తృప్తి పడటం కూడా అలవాటయింది. అటువంటిది, ఇప్పుడీ వృత్తిని వదులుకుని, నేను ఉద్యోగం చెయ్యట మనేది మీరన్నంత తేలికా, బాబూ?

"నా పిల్లల విషయమైనా అంతే, బాబూ, వాళ్ళు అప్పుడప్పుడూ 'ఉద్యోగాలు, ఉద్యోగాలు', అంటూంటారు కానీ, వాటిల్లోకి వెడితే ఇక్కడికీ విద్యా పోతుంది. అక్కడ పెద్ద ఉద్యోగాలూ రావు. చివరికి వాళ్ళు నౌకర్లుగానో, గుమాస్తాలు గానో చాలీ చాలని జీతాలతో జీవించవలసివస్తుంది. అసలయినా, బాబూ, అందరికీ ఉద్యోగాలు కావాలంటే ఎక్కడ నుంచి వస్తాయండి? . . . కానీండి, బాబూ, ఎట్లా జరగాలో అట్లా జరుగుతుంది. కాల ధర్మాన్ని ఎవడూ మార్చగలడు?"

బయట నుంచి ఆ వృద్ధుడి తాలూకు మనుషులు వృద్ధుణ్ణి పిలవగా అతడు లేచి నుంచున్నాడు.

నేను లోపలికి వెళ్ళి పది రూపాయలు తెచ్చి అతడి చేతిలో పెట్టాను.

అతడు దాన్ని కళ్ళ కద్దుకున్నాడు. చెమర్చిన కళ్ళతో కృతజ్ఞతా పూర్వకంగా నా వైపు చూస్తూ, "బాబూ! జాతిలో దానం చెయ్యటం మనే నాడి ఇంకా ఆడుతూంది. సంతోషం. సెలవు" అన్నాడు. అక్కణ్ణుంచి కదిలాడు.

(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక 18-5-77)

★★★ ★★★ ★★★